

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**బొంబాయ్ హమారీ బొంబాయ్, యే రాజ్ దులారా బొంబై,**

**యే జాన్ సె ప్యారీ బొంబై,**

**జీనా సిఖాయా తూ నే, అప్నా బనాయాతూనే...**

హిందీ సినిమాలలో బొంబాయి, ప్రస్తుతం ముంబాయి, గురించి వచ్చినన్ని పాటలు ఇతర ఏ నగరం గురించీ రాలేదనటం అనృతం కాదు. బొంబాయి పట్ల దేశ ప్రజలకు ఓ ప్రత్యేక ఆకర్షణ ఉన్నట్టనిపిస్తుంది. దేశం నలుమూలలనుంచి ప్రజలు బొంబాయి వచ్చి చేరతారు. దేశం నలుమూలలనుంచి అత్యంత సృజనాత్మక కళాకారులు తమ కళా ప్రదర్శనకు బొంబాయి వస్తారు. బొంబాయిని తమ ఇల్లుగా మలచుకుంటారు. విజయం సాధిస్తే దేశ ప్రజల మన్ననలందుకుంటారు. లేకపోతే, బొంబాయిలోని మురికి వాడలలో దుర్భర దారిద్ర్యంలో, దీనంగా జీవితాలు గడుపుతారు. కనుమరుగైపోతారు. బొంబాయి ఎవ్వరినీ కాదనదు. పొమ్మనదు. అందరినీ అక్కున చేర్చుకుంటుంది అవకాశాలిస్తుంది. అదృష్టాన్ని బట్టి అందలాలెక్కుతారు కొందరు. సందులలో మిగిలిపోతారు అనేకులు. అందుకే బొంబాయి గురించి అన్ని పాటలు, అన్ని కథలు.

'స్ట్రీట్ సింగర్' అనే సినిమాలో శంకర్ జై కిషన్ సంగీత దర్శకత్వంలో హస్రత్ జై పురి బొంబాయికి అర్పించిన నీరాజనం ఈ పాట. ఈ సినిమా నిర్మించి హీరోగా నటించింది చంద్రశేఖర్ వైద్య. చంద్రశేఖర్, శంకర్ లిద్దరూ హైదరాబాదు వాసులు . బాల్యం నుంచి హైదరాబాదు వ్యాయామశాలలో కలసి వ్యాయామం చేశారు. కుస్తీ నేర్చుకున్నారు. శంకర్, సంగీత దర్శకుడయ్యాడు. జై కిషన్‌తో కలసి హిందీ సినీ సంగీత రూపు రేఖలను రూపాంతమొందించాడు. చంద్రశేఖర్ వైద్య సినిమాలలో అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. అంత విజయం సాధించలేకపోయాడు. 'చచచ' అనే

సినిమాలో హీరోగా నటించాడు. సినిమా విఫలమయింది కానీ పాటలు ఈనాటికీ వినిపిస్తూంటాయి. ఆ సినిమాకి సంగీత దర్శకుడు ఇక్బాల్ ఖురేషి. బొంబాయిలో విజయం సాధించలేకపోయిన మరో హైదరాబాదీ. సుబహ న ఆయి, వో హమ్ నథే ' వంటి హిట్ రఫీ పాటల సరసన, హైదరాబాదీ కవి మఖ్దూం మెయినుద్దీన్ కవిత 'ఎక్ చంబేలీకే మంద్వేతలే' ను పాటగా మలచారీ సినిమాలో.

'చచచ' తరువాత 'స్ట్రీట్ సింగర్' సినిమాను నిర్మించాడు చంద్రశేఖర్. ఈ సినిమాను శంకర్ 'సూరజ్' పేరుతో సంగీత దర్శకత్వం వహించాడు. పాటలు ఆకర్షణీయంగా సుందరంగా ఉంటాయి. కానీ సినిమా విజయవంతం కాలేదు. దీని తరువాత 1971లో 'హల్ చల్' అనే సినిమాను నిర్మించాడు చంద్రశేఖర్. అదీ విఫలమయింది. 2021లో ముంబాయిలో మరణించాడు చంద్రశేఖర్. ఆయనే రాసి, రూపొందించిన సినిమా 'స్ట్రీట్ సింగర్'లో తమను హత్తుకుని, జీవించటం నేర్పించిన బొంబాయికి నీరాజనంగా ఈ పాటను సినిమాలో పొందు పరచాడు.

బొంబాయి అందరిది. ఏ ఒక్కరూ ఇది 'నాది' అనటానికి వీలులేదు. అందరినీ ఆహ్వానించి, ఆదరించి ఆశ్రయమిస్తుంది బొంబాయి.

**భూఖోంకే పేట్ పాలే, నంగోంకే తన్ కో ఢాకే**

**గిర్తేకో తూనే సంభాలే మజ్‌దూర్ కే దిల్‌మే ఝూంకే,**

**బొంబాయ్ హమారీ బొంబాయి...**

ఆకలితో ఉన్నవారి కడుపు నింపింది. శరీరం కప్పుకునేందుకు బట్టనిచ్చింది. క్రిందపడే వారిని పట్టుకుని నిలిపింది. కాయకష్టం చేసేవారి హృదయలోతుల్లోని భావాలను అర్థం చేసుకుంది మన ప్రియమైన బొంబాయి.

ఈ పాటలో  బొంబాయి పై ఎంతో ప్రేమ భావన కనిపిస్తుంది. కృతజ్ఞతా భావన కనిపిస్తుంది. కానీ సాధారణంగా బొంబాయి గురించి అధికశాతం నెగిటివ్‌గానే మాట్లాడతారు. బొంబాయి 'మోసం' అంటారు. అక్కడ బ్రతకటం కష్టం అంటారు.

**ఏయ్ దిల్ హై ముష్కిల్ జీనాయహాన్**

**జర హట్‌కే, జర బచ్‌కే, యే హై బొంబాయ్ మేరీ జాన్..**

సి..ఐ..డి సినిమాలో ఓపినయ్యర్ సంగీత దర్శకత్వంలో 'మజ్రూహ్' అద్భుతంగా రాసిన పాట ఇది. ఇక్కడ బ్రతకటం కష్టం. అన్నిటినుంచీ, మోసాలు, కుట్రలు, కుతంత్రాల నుంచీ, పక్కకు తప్పుకుంటూ, తప్పించుకుంటూ జాగ్రత్తగా బ్రతకాలి. ఇది బొంబాయి అంటూ హాస్యంగా పాడే ఈ పాటలో బొంబాయి.

కహిన్ బిల్డింగ్, కహిట్రామే, కహి మోటార్ కహిన్ మిల్,

మిల్తా హై యహ సబ్‌కుచ్, ఎక్ మిల్తా నహి దిల్..

ఇక్కడ భవనాలున్నాయి ట్రాములున్నాయి. మోటార్లున్నాయి. మిల్లులున్నాయి. అన్నీ ఇక్కడ దొరుకుతాయి, ఒక్క హృదయం తప్ప. అంటే హృదయం ఉన్న మనిషి తప్ప అన్నీ బొంబాయిలో దొరుకుతాయి కాబట్టి ఇక్కడ బ్రతకటం కష్టం అని అంటున్నాడు కవి.

**హై యే బొంబయ్ షహర్, హాద్సోంక షహర్ హై**

**యహో జిందగీ హాద్సోంక సఫర్ హై**

**యహా, రోజ్ రోజ్, హర్ మోడ్ మోడ్ ఫర్**

**హోతాహై కోయీ న కోయీ హాద్సా...**

'హాద్స' అంటే ఘోరమైన ప్రమాదం. ఈ బొంబాయి నగరం ప్రమాదాల నగరం అంటున్నాడు. ఎంజి హష్మత్ 'హాద్సా' అనే సినిమా పాటలో. ఈ పాటకు సంగీతం కూర్చింది కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ. బొంబాయి జీవితం ప్రమాదాల ప్రయాణం అనీ ఇక్కడ రోజు రోజూ, ప్రతి మలుపులో ఏదో ఓ రకమైన ప్రమాదం సంభవిస్తుందని అంటున్నాడు. చరణంలో బొంబాయిలో జీవితాన్ని వర్ణిస్తాడు కవి.

యహా కే ఖుషీ ఔర్ గమ్  హై అనోఖే

బడే ఖూబ్ సూరత్ సే హోతే హై ధోఖే

బహుత్ తేజ్ రఫ్తార్  హై  జిందగీకి

హై   ఫుర్సత్  కిసే కోయి  కిత్నా భీ సోచే

ఖుషీ హాద్సాహై, గమ్  హాద్సా హై

హకీకత్ ఖులాకర్ హర్ ఏక్ భాగ్తా హై

బొంబాయిలో సుఖదుఃఖాలు విచిత్రమైనవట. మోసాలు అందమైనవట.జీవితం అత్యంత వేగవంతం. ఇక్కడ ఎంత ఆలోచించినా, ఆలోచించేందుకు కూడా తీరిక ఉండదట. ఇక్కడ సుఖం లభించటం ఓ ప్రమాదం. దుఃఖం ఓ ప్రమాదం. అందరూ నిజం మరచి పరుగులిడుతూనే ఉంటారట. అందుకే బొంబాయి ప్రమాదాల నగరం. జీవితం ఓ ప్రమాదం అంటాడు కవి.

కానీ హాలీడే గడపటం కోసం బొంబాయి వచ్చిన శశికపూర్ కు  మాత్రం బొంబాయి ఎంతో నచ్చింది. అందుకే బొంబాయి నచ్చిందని పాడుతూ బొంబాయి అంతా తిరిగాడు. 'హాలీడే ఇన్ బొంబాయి' సినిమాలో.

యే హసీన్ బొంబాయి హమ్  కోతో జమ్  గయీ

జిస్ తరఫ్  నజర్ ముడి,ఉస్ తరఫ్ హీ జమ్ గయీ

దేఖియే మంజిర్ నయే నయే నయా

హాలీడే హాలిడే హాలిడే ఇన్ బాంబే..

బొంబాయి చూడగానే నచ్చిందట. ఎటు చూస్తే అక్కడే కళ్లు ఆగిపోయి కదలనంటున్నాయట. అంతా కొత్త కొత్త దృశ్యాలు., అందాలు అని సంతోషం వ్యక్తపరుస్తున్నాడు హీరో.

**ఈ హై బొంబాయి నగరియా దేఖ్ బబువా**

**సొనే చాందీకా డగరియా దేఖ్ బబువా**

**జాదూటోనే కీ బజారియామే, మాయకీ  నగరియామే**

**ఛట్ పట్ బద్ లే ముఖద్దర్‌కా లేఖ్ బబువా.**

'డాన్' సినిమాలో 'అంజాన్' రాసిన ఈ పాట సూపర్ హిట్ పాట ఇది. క్షణాలలో అదృష్టం మారిపోయే మాయానగరం బొంబాయి అంటున్నాడీ పాటలో. బంగారం, వెండి దారులను, మాయ మంత్రాల బజార్లనూ, క్షణాలలో అదృష్టాలు మారిపోయే మాయానగరిని చూడమంటూ బొంబాయిలోని జీవితాలను పాటలో చూపిస్తాడు.

**ఓ దేఖో దూర్‌దూర్‌సే, లోగ్ దూర్‌దూర్‌సే**

**ఇహ ఆతే హై దావ్ లగానే**

**దేశ్‌గావ్ ఛోడ్‌కే, ప్రీత్‌ప్యార్ ఛోడ్‌కే సోయా నసీబా జగానే,**

**అరే, అప్నా క్యాహోగా, హోగా సోహోగా**

**పాసా హంనే దియా హై ఫేక్ బబువా...**

తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు, నిద్రిస్తున్న అదృష్టాన్ని జాగృతం చేసేందుకు దూర  దూరాలనుంచి దేశం, గ్రామాలు వదలి, ప్రేమలను, ప్రియతములను వదలి, ఏమైతే అదే అయిందని బొంబాయి వచ్చి చేరతారు మనుషులు అంటున్నాడీ పాటలో. ఇటీవలే జరిగిన ఓ సర్వే ప్రకారం యువకులే కాదు పిల్లలు కూడా ఇల్లొదిలి పారిపోయి బొంబాయి చేరుతున్నారు. బొంబాయికి పొట్టచేత పట్టుకుని వలస వచ్చిన వారిలో 25 శాతం పిల్లలే! దేశంలో పిల్లలతో అధికంగా పని చేయించే నగరం ముంబాయి. ఇటీవలె కరోనా సమయంలో ముంబాయికి వచ్చిన వలసదార్లు, అధిక సంఖ్యలో ముంబాయి వదలి వెళ్లారు. కరోనాలో కాలినడకన స్వగ్రామం పోవటానికి ప్రేరణ ముంబాయి నుంచే లభించింది. అందుకే దేశం నలుమూలలనుండి ప్రజలు బొంబాయి చేరతారు. స్థిరపడతారు. అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. అయితే ప్రముఖులవుతారు. లేదా బొంబాయి స్లమ్స్ లో మిగిలిపోతారు.

**యే బొంబాయి షహర్‌కా బడా నామ్ హై పర్ గడబడ్**

**ఘోటాలే హర్‌కామ్ హై**

**అంధోంకో యహా సూఝేదూర్‌కీ**

**ఆంఖే వాలోంకో మిల్తా నహీ రాస్తా**

**సున్తా నహీ కోయీ మజ్బూర్‌కి**

**కిసీకో కిసీ సే నహీ వాస్తా**

**సునో భయ్యా మేరే యే పైగాం హై..**

'నూర్ దేవాసి' రచించిన ఈ గీతానికి సంగీతాన్ని అందించింది బిపిన్ దత్తా. 1959లో వచ్చిన 'క్యాయే బొంబాయిహై' అన్న సినిమాలోని ఈ పాట తెలిసిన వారు అరుదు. దాదాపుగా విస్మృతిలో పడిందీ పాట. బొంబాయిని 'డాన్' సినిమాలో 'మాయానగరి' అన్నాడు. అది 'మాయానగరి' ఎందుకో 1959లోనే 'నూర్ దేవాసి' చెప్పాడు. ఇక్కడ గుడ్డివాళ్లకు దూరం దూరం కనిపిస్తుందట. కళ్లున్న వారికి దారి తెలియదు. ఎవరు ఎవరి బాధలను ఎవరు పట్టించుకోరు. ఎవరికీ, ఎవరితో బంధం, అనుబంధాలు లేవు. పేరు గొప్ప అయినా అంతా మోసం అయిన బొంబాయి నగరం ఇది అంటున్నాడు గేయరచయిత. శ్రీ 420 సినిమాలో రాజ్‌కపూర్ పాత్ర బొంబాయ్ లో అడుగు పెట్టగానే ఒక బిచ్చగాడు బొంబాయ్ గురించి ఇలాంటి మాటలే చెప్తాడు.

**లాఖ్ లాఖ్ రోజ్ ఆకే బస్ జాతా హై**

**ఇస్ షహర్ సే ఇస్ దిల్ లగాకర్ ఫస్ జాతాహై**

**సాలా, ఇధర్‌తో ఫుట్ పాత్ భీ హౌజ్ ఫుల్ హై**

**షోలా హై యా హై బిజురియా దిల్‌కే బజరియా బొంబాయ్ నగరియా!**

విశాఖ్ శేఖర్ సంగీత దర్శకత్వం వహించిన టాక్సి నెం 9211 సినిమాలోదీ పాట 'బొంబాయి నగరియా'. రోజూ లక్షల సంఖ్యలో బొంబాయి వస్తారు. వచ్చి ఇక్కడే స్థిరపడిపోతారు. ఈ నగరాన్ని ప్రేమించి చిక్కుకు పోతారు. బంగారు దారుల్లో పడుకునేందుకు కూడా స్థలం దొరకదు. హిందీలో 'సోనా' అంటే బంగారం. 'సోనా' అంటే నిద్రపోవటం. ఈ పదం మీద పన్ వేశాడన్నమాట. గేయ రచయిత. ఇక్కడ ఫుట్‌పాత్‌ల మీద కూడా స్థలం లభించదు అంటున్నాడీ పాటలో. 1959లో పాటకీ 2006లో పాటకీ  భావంలో సారూప్యం ఉన్నా భాషలో తేడా వచ్చేసింది. భావాన్ని ప్రకటించే విధానంలో తేడా వచ్చింది. బొంబాయి జీవితంలో మాత్రం మార్పు రాలేదు. అప్పుడు 'ఘోటాలా నగరీ' అన్నారు. ఇప్పుడు 'మాయనగరీ ' అంటున్నారు.

ముంబయ్ ఏక్‌దం

danger place. where you survive if you have  to be తేజ్

you got to be sure to win the race

ఇది 'ముంబయ్ బాయ్స్' అనే సినిమాలో జావేద్ జాఫ్రీ పాడిన పాట. బొంబాయిని చాలా ప్రమాదకరమైన స్థలం అనీ, ఇక్కడ బ్రతకాలంటే ఎంతో చురుకుగా ఉండాలని ఈ వేగాన్ని తట్టుకోవాలని చెప్తుందీపాట. ఈ పాటంతా బొంబాయిలో మోసాలెలా జరుగుతాయి, ఎలా తట్టుకోవాలో, నిరంతరం ఉద్విగ్నతామయమైన జీవితంలో దేన్నీ పట్టించుకోకుండా హాయిగా ఎలా బ్రతకాలో చెప్తుంది.

**భాయ్ గిరీ కో ఛోడ్ సబ్ బక్వాస్**

**భాయ్ కే అందర్ జో రహ్తే బిందాస్**

**భాయ్ కోదేగా తరస్, హోయేంగా వో ఖల్లాస్**

**బహేగా ఉస్కా బ్లడ్ జస్ట్  లైక్ టొమాటో సాస్....**

అంటే, బొంబాయిలో ఎలాంటి చీకూ చింతా లేకుండా బ్రతకాలంటే భాయి (మాఫియా) శరణు కోరాలని చెప్తున్నాడీ పాటలో. లేకపోతే, అతడి రక్తం టమాటా రసంలా ప్రవహిస్తుందట. ఈ పాటతో స్ట్రీట్ సింగర్ పాటను పోలిస్తే 1966కీ 1998కీ నడుమ బొంబాయి గురించిన ఆలోచనల్లో ఎంత మార్పు వచ్చిందో, సామాజిక జీవితంలో కృతజ్ఞత,

ప్రేమ, నైతిక విలువలు ఎంతగా అంతరించాయో స్పష్టమవుతుంది. అంతేకాదు, ఉన్నది ఉన్నట్టు చూపించే నెపంతో ఏ రకంగా నైచ్యం, దౌష్ట్యం, చెడు అలోచనలు సినిమాలద్వారా సమాజంలో సామాన్యం అయి స్థిరపడుతున్నాయో కూడా అర్ధమవుతుంది.

**జోతేరీ బాహమే ఆతా హై యహా సే ఫిర్‌న జాతా**

**ఇస్ నగరీ మే భేద్ భూల్ హై సబ్ సే మేరా నాతా**

బొంబాయిని ప్రేయసిలా భావిస్తున్నాడు గేయ రచయిత హస్రత్ జైపురి. ఎవరు బొంబాయి బాహువుల్లోకి వస్తారో, వారు ఇక ఎటూ పోలేదట. భేదభావాలు లేక అందరితో ఆత్మీయ సంబంధం ఉంటుందట. ఆలోచనల్లో, భావ ప్రకటనలో, ఎంత తేడా!

**భారత్ కా తూహీ చందా**

**జహా చల్తా సబ్‌కా దంధా**

**తూలైలా, హం సబ్ మజ్నూ దిల్ తేరే ప్యారకా బందా**

**బొంబాయి హమారీ బొంబాయి.**

వెండి దారుల్లో ప్రేమలేదు, బంగారు దారుల్లో నిద్రించే స్థలం లేదని ఫిర్యాదులు చేయటంలేదు హస్రత్. బొంబాయి, భారత్ దేశానికి చంద్రుడు అంటున్నాడు. ఇక్కడ ఎవరెవరు వారి వారి పనులు విజయవంతంగా నిర్వహిస్తారంటున్నాడు. బొంబాయి లైలా అయితే, ఇక్కడ స్థిరపడేవారంతా బొంబాయి ప్రేమికులు, మజ్నూ లలాంటి వారంటున్నాడు కవి.

గమనిస్తే, బొంబాయికి వలస వచ్చి జీవికను సాగించే వారెందరో. వీరు ఒక్కసారి బొంబాయి వస్తే, బొంబాయిని విడిచి రారు. అక్కడే స్థిరపడతారు. వీరందరికీ బొంబాయి జీవిక నిచ్చింది. వారు తరతరాలుగా ఎదిగి బ్రతికి బట్టకట్టే వీలు నిచ్చింది. అలాంటి బొంబాయిని ప్రేమించాలి తప్ప ద్వేషించి, దూషించి, తప్పులెన్నుతూంటే వచ్చే లాభం ఏమిటి? సమాజంలో మంచి ఆలోచనలు విస్తరింపచేయాలి. గళంలో గరళం నింపుకుని సమాజానికి అమృతం పంచాలి. ఇది కళాకారుల బాధ్యత. ఎంతటి కష్ట పరిస్థితులలోనయినా సంతోషంగా జీవించే శక్తిని సామాన్యుడికి ఇవ్వాలి కళాకారులు. నిరాశలోనూ ఆశాజ్యోతిని చూడగలిగే స్థయిర్యాన్నివ్వాలి. కానీ ఆధునిక సిద్ధాంతాల ప్రభావంలో పడి నిజాన్ని

ప్రదర్శిస్తామన్న ఆత్మవంచనలో పడి సినిమాలు ప్రజలలో నిరాశ నిస్పృహలు పెంచుతున్నాయి, ద్వేష భావనలు పెంచుతున్నాయి. పోరాట పటిమను నేర్పే బదులు, పలాయనం నేర్పుతున్నాయనిపిస్తుంది. ఫిర్యాదులు, ఫర్యాదులు మాత్రమే నేర్పుతున్నాయి. బొంబాయికి పొట్ట చేత పట్టుకుని వచ్చి పేరు సంపాదించి, ఆ బొంబాయినే దూషిస్తున్న కళాకారులు బొంబాయిని తమ పాటల్లో చిత్రించిన విధానం చూస్తే. ఆకలేసినప్పుడు అన్నం పెడితే, కడుపు నిండా తిని త్రేన్చి , కంచం శుభ్రంగా లేదని తిట్టినట్టుంటుంది బొంబాయి గురించిన పాటలను వింటుంటే..

సి ఐడి సినిమాలోని బొంబాయి పాటలో, ఆరంభమంతా బొంబాయి జీవితంలోని వైరుధ్యాలను ప్రదర్శించిన మజ్రూహ్ పాట చివరలో గొప్ప సత్యం చెప్పి, దోషం బొంబాయిలో కాదు మనుషుల్లో, వారి ఆలోచనా విధానంలో ఉందని సున్నితంగా చెప్తాడు.

**బురా దునియాకో కహెతా, ఐస భోలా తూ న బన్**

**జో హై కర్తా, వో హై భర్తా, హై యహ కా యే చలన్**

**దాదాగిరి నహీన్ చల్నేకి యహాన్, యే హై బొంబాయి మెరీజాన్.**

ప్రపంచాన్ని చెడ్డదనేంతటి అమాయకత్వాన్ని, మూర్ఖత్వాన్ని ప్రదర్శించకు. ఎవరు ఎలాంటి పని చేస్తే అలాంటి ఫలితం పొందుతారు. ప్రపంచం తీరు ఇది. ఇక్కడ ఒకరిపై బల ప్రయోగం నడవదు. ఇది బొంబాయి బాబు అంటున్నాడు మజ్రూహ్.. అంతకుముందు బొంబాయిలో చూపించిన లోపాలన్నీ ఈ ఒక్క చరణంతో కొట్టి పారేసి, చెడ్డది ప్రపంచం కాదు, చెడ్డ పనులు చేసే మనిషి చెడ్డవాడు అని కుండబద్దలు కొట్టాడు మజ్రూహ్. ఇది బాధ్యత తెలిసిన కళాకారుల రచన పద్ధతి. బొంబాయి అందించే సౌఖ్యాలు అనుభవిస్తూ, బొంబాయిని నీచంగా, ఘోరంగా ప్రదర్శించి, ప్రచారం చేసి, కాలర్లెగరేసే కళాకారులందరికీ గుణపాఠం నేర్పేటటువంటి పాట ఇది.

'ఏయ్ దిల్ హై ముష్కిల్ జీనా యహాన్' అని ఆరంభించిన పాటను చివరలో, మంచి పనులకు మంచి ఫలితం ఉంటుందని చెప్తూ 'యే దిల్ హై ఆసాన్ జీనా యహాన్' అని ముగిస్తాడు మజ్రూహ్.. అంటే, మంచి పనులు చేస్తే బొంబాయిలో బ్రతకటం సులభం అన్నమాట. బొంబాయిలోనే ఏమిటి, ఈ ప్రపంచంలో ఎవరికయినా, ఎక్కడయినా 'మంచి'గా బ్రతకటం సులభం. చెడు పనులు చేస్తూ బ్రతకటం కష్టం.

(మరిన్ని మధురమైన పాటలతో వచ్చే నెల)

Post your comments